క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

జగద్గిరిగుట్ట: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ ఏఈ రాధాకిషన్‌రెడ్డి తెలిపారు. శ్రీనివాస్‌నగర్ ఫీడర్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్, లెనిన్‌నగర్, రింగ్ బస్తీ, మగ్దూమ్‌నగర్, సీసాల బస్తీ, భగత్‌సింగ్ మార్గ్, పోలాల బస్తీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు అసైన్డ్ భూ బాధితుల సదస్సు

నిజాంపేట్: తెలంగాణ భూరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 24న సోమాజీగూడలోని ప్రెస్ క్లబ్‌లో అసైన్డ్ భూమి బాధితుల సదస్సు నిర్వహించనున్నారు. దళిత, గిరిజన బలహీనవర్గాలకు పంపిణీ చేసిన సీలింగ్, భూదాన్, లిడ్ క్యాప్, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన భూములను గుంజుకుంటున్న ప్రభుత్వ తీరుకు నిరసనగా సదస్సు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగే ఈ సదస్సులో పార్టీలు, సంఘాలకు అతీతంగా పాల్గొనాలని కోరారు. అసైన్డ్ భూబాధితుల సమస్యలను పరిష్కరించడానికి సలహాలు, సూచలనతో పాటు మద్దతు తెలపాలని టీబీఆర్‌ఎస్ జాతీయ కార్యదర్శి కమ్మెట భూపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బురికి రాములు, రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసమ్మ విజ్ఞప్తి చేశారు.

రెండు ఆర్టీసీ బస్సుల ఢీ

ప్రయాణికులకు స్వల్పగాయాలు

భాగ్యనగర్‌కాలనీ: రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొట్టుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం ... సుమిత్రానగర్‌లోని పిల్లర్ నం.794 వద్ద (ఏపీ 28 జెడ్ 4777) వెళుతున్న బస్సును వెనుక నుంచి వచ్చిన మరో ఆర్టీసీ బస్సు (ఏపీ 28జెడ్ 4235) ఢీకొని సడన్ బ్రేక్ వేయటంతో ముందున్న బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా సీటు ముందున్న రాడ్లకు గుద్దుకున్నారు. ఈ ఘటనలో నలుగురికి స్వల్పగాయాలు కావటంతో రామ్‌దేవ్ రావ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బస్సులో ప్రయాణిస్తున్న యల్లమ్మబండకు చెందిన అఫ్షా జాబిన్ పెదవికి గాయమై కుట్లు పడ్డాయి. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే తనకు గాయమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరో ముగ్గురు చికిత్స అనంతరం ఇళ్లకు తిరిగి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

యూఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విశేష స్పందన

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌లోని తాజ్ బంజారా హోటల్‌లో గురువారం టీ-కాలేజ్ డేస్ ఆధ్వర్యంలో యూఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు. ఇందులో 50కి పైగా యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు. అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకొనే వారికి టీటీ-కాలేజ్ డేస్, యూఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్ మంచి వేదిక అని నిర్వాహకులు సంతోష్‌గుప్తా, సంజయ్ గుప్తా తెలిపారు.

కవలల దినోత్సవం



టీవీఆర్ మోడల్ హైస్కూల్‌లో కవలలతో మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి

జీడిమెట్ల: అపురూపాకాలనీ టీవీఆర్ మోడల్ హైస్కూల్‌లో కవలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణారెడ్డి ట్విన్స్‌కు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కవలలుగా పుట్టడం ఎంతో అదృష్టమన్నారు. ఎదుటి వారి మనసులు గెలుచుకునే మనస్తత్వాన్ని కలిగి ఉంటారని పేర్కొన్నారు. కవలలుగా పుట్టిన విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉంటూ చక్కటి విద్యావంతులుగా ఎదగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణాలో క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం

శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: తెలంగాణాలో క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం క్రీడాకారులు ప్రోత్సహిస్తోందని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గాజులరామారంలో రావులశేషగిరి యువ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా శంభీపూర్‌లోని కార్యాలయంలో ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు విజేతలుగా నిలిచిన జట్లకు గురువారం ట్రోఫీ, బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడల్లో ప్రతిభ కనబరిచి తమ ప్రాంతానికి, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాయ సంస్థ మాజీ చైర్మన్ నాగరాజుయాదవ్, కార్పొరేటర్ రావుల శేషగిరి, మాజీ కార్పొరేటర్లు సురేష్‌రెడ్డి, పాలకృష్ణ, బీఆర్‌ఎస్ డివిజన్ల అధ్యక్షులు విజయ్‌రామ్‌రెడ్డి, మహ్మద్ రఫీ, మాజీ సర్పంచ్ జక్కుల కృష్ణ యాదవ్, నాయకులు యాదగిరి, బంటి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణను 40ఫీట్లకు తగ్గించండి..

◆ కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లికి చెందిన ప్రజలు ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుని కలిశారు. రోడ్డు విస్తరణతో తమ ఇళ్లు, జీవన ఉపాధి ఇస్తున్న దుకాణాలను కోల్పోతున్నామని.. 50 ఫీట్ల వెడల్పుకు బదులుగా 40 ఫీట్లకు తగ్గించేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, వైస్‌చైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు

తెలంగాణ శాసన మండలి ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు చేపట్టిన శంభీపూర్ రాజును గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



జర్నలిస్ట్‌ల సమస్యలను పరిష్కరించండి..

◆ శాసన మండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును టీయూడబ్ల్యూజేహెచ్-143, టీఎస్‌యూడబ్ల్యూజే, టీజేయూఎఫ్ జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జర్నలిస్ట్‌ల సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. జర్నలిస్ట్ సంఘాల నేతలు ఆస్కాని మారుతిసాగర్, రంగు వెంకటేష్‌గౌడ్, సుధీర్ మంకాల, కె.వెంకట్, గడ్డమీది బాల్‌రాజ్‌గౌడ్, కోటగడ్డ శ్రీనివాస్, శేఖర్, చింతల్ శ్రీను, అశోక్, శివాజీ తదితరులు ఉన్నారు.

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించింది

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం ప్రగతి యాత్రలో భాగంగా సూరారం డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్, వేమననగర్, శ్రీకృష్ణనగర్, సోనియాగాంధీనగర్, కార్తీక్ నేచర్ స్పేస్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

◆ శ్రీరామ్‌నగర్ కాలనీలో రూ.3.49 కోట్లతో కొత్త కుంట నుంచి పెద్ద చెరువు వరకు చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, రూ.48 లక్షలతో సీసీ రోడ్లు, రూ.1.50 కోట్లతో కొత్త కుంటకు డ్రైనేజీ మళ్లింపు పైపులైన్ పనులను పరిశీలించారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏఎల్ బషీరుద్దీన్, ఖాసిం బీ, సుధాకర్‌రెడ్డి, ముకుంద రావు, సాజిద్, ప్రభుదాస్, కలీం, బస్తీల వాసులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

జగద్గిరిగుట్ట: డివిజన్ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తున్నానని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. డివిజన్ పరిధిలోని రాజీవ్‌గృహకల్పలో గురువారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరలోనే మొదలు పెడతామని తెలిపారు. పలు కాలనీల్లో అంతర్గత రోడ్లను పూర్తి చేస్తున్నామన్నారు. స్థానిక నాయకులు సంతోష్, ప్రభాకర్, వనం శీను, ఆంజనేయులు, భాస్కర్, హనుమంతు, వెంకటస్వామి, భూపతిరెడ్డి, దుర్గయ్య పాల్గొన్నారు.



జగద్గిరిగుట్ట గృహకల్పలో సమస్యలను వింటున్న కార్పొరేటర్ జగన్

మార్చి 3 వరకు ప్రథమ పుష్కర బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని శ్రీపద్మావతి, గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రథమ పుష్కర బ్రహ్మోత్సవాలు ఈనెల 20వ తేదీ నుంచి మార్చి 3వ తేదీ వరకు జరుగనున్నాయని ఆలయ అధ్యక్షుడు తిరుమలరావు, ప్రధాన కార్యదర్శి మాధవ రెడ్డిలు ఓ ప్రకటనలో తెలియజేశారు. 24న శ్రీదా సాంజనేయస్వామి నూతన విగ్రహ యంత్ర ప్రతిష్ఠ, 25న శ్రీవిష్వక్సేన ఇష్టి, 26న శ్రీదేవి, భూదేవి సమతే శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సం, సాయంత్రం గరుడ సేవ, 27న శ్రీవాసుదేవ ఇష్టి, శ్రీమహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం, 28న శ్రీగోదావరి అమ్మవారికి అభిషేకం, మార్చి 1వ తేదీన అపమృత్య దోష నివారణ, శ్రీనృసింహేష్టి, శ్రీవారికి లక్ష పుష్పార్చన, తులసీ దళార్చన, 2వ తేదీన శ్రీసుదర్శణ ఇష్టి, మహాపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ, చక్రస్నానం, శ్రీపుష్ప యాగం, ద్వాదశారాధన, ధ్వజారోహణం, 3వ తేదీన శ్రీవెంకటేశ్వరస్వామికి అభిషేకం, అష్టోత్తర శత ఘటాభిషేకం ఉంటుందన్నారు.

వేడుకున్నా ఆపలేదు!



గుడిసెలు తొలగించవద్దని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను వేడుకుంటున్నా గుడిసెవాసులు



సర్వే నం.342లో గదులను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సుభాష్‌నగర్: గాజులరామారంలోని ప్రభుత్వ స్థలంలో వెలిసిన గుడిసెల తొలగింపు ఆందోళనకు దారి తీసింది. కైసర్‌నగర్‌లోని సర్వే నం.342లో ప్రభుత్వ స్థలంలో వెలసిన గదులు, గుడిసెలను గురువారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో తొలగించారు.దీంతో గుడిసెవాసులకు రెవెన్యూ అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇటీవల కాలంలో వరుస కూల్చివేతలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని మిగతా వారు ఆందోళన చెందుతున్నారు.

వీధి కుక్కల బెడదతో ప్రజలు బెంబేలు

నిజాంపేట్: వీధి కుక్కల బెడదతో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బస్తీల ప్రజల భయం గుప్పిట్లో ఉంటున్నారని కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి బాలపీరు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల చోటు చేసుకుంటున్న వరుస కుక్కల దాడులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులకు వీధి కుక్కలు కరవడంతో ఉదయం వేళల్లో పనులు చేసేందుకు జంకుతున్నారని తెలిపారు. కుక్కల దాడి ఘటనలో జరిగిన సమయంలో హడావుడి చేసే అధికారులు ఆపై పత్తా లేకుండా పోతున్నారని విమర్శించారు. వీధి కుక్కల బెడదను శాశ్వతంగా నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జీఓ.59 దరఖాస్తుదారులకు అండగా ఉంటాం

బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: జీఓ.59 దరఖాస్తుదారులకు బీజేపీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం బీజేపీ సీనియర్ నాయకులు చెంది శ్రీనివాస్, పత్తి రఘుపతి గాజులరామారంలోని కార్యాలయంలో జీఓ.59 దరఖాస్తుదారులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... జీఓ. 59 కింద దరఖాస్తు చేసుకున్న వారికి లక్షల్లో డిమాండ్ నోటీసులు రావడంతో బెంబేలెత్తుతున్నారని అన్నారు. నామమాత్రపు రుసుం తీసుకోవాల్సింది పోయి ప్రభుత్వం ఇలా దోపిడీకి పాల్పడటం అన్యాయమన్నారు. లక్షల్లో వచ్చిన డిమాండ్ నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాల ద్వారా ప్రభుత్వ మెడలు వంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేష్ మిశ్రా, పృథ్వీరాజ్, శంకర్‌గౌడ్, రవినాయక్ తదితరులు ఉన్నారు.



జీఓ.59 దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని శ్రీశైలంగౌడ్‌ను కోరుతున్న నాయకులు



జీడిమెట్ల: జానెడు పొట్ట నింపుకోవాలంటే పని చేయాల్సిందే. అదే కుటుంబాన్ని పోషించాలంటే మరింత కష్టపడాల్సిందే. ఓ వ్యక్తి తన కుటుంబాన్ని పోషించుకోవాడానికి ఉదయం పరిశ్రమలో పనిచేస్తూ రాత్రిపూట ఐస్ క్రీం విక్రయిస్తున్నాడు. రెండు పనులు చేస్తుండటంతో నిద్రలేక తాను అమ్ముతున్న ఐస్‌క్రీం బండిపైనే అలసిపోయి నిద్రపోయాడు. సదరు వ్యక్తి ఈ విషయాన్ని సాక్షితో పంచుకున్నాడు.

డా.రాజ్‌వీర్‌కు బెస్ట్ మెజీషియన్ అవార్డు

కుత్బుల్లాపూర్: ఇంటర్నేషనల్ మెజీషియన్ డేను పురస్కరించుకుని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మెజీషియన్, సైకాలజిస్ట్ డాక్టర్ రాజ్‌వీర్ బెస్ట్ మెజీషియన్ సర్టిఫికెట్ పొందారు. ఐఏఎస్ అధికారి బి.వెంకటేశం, ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఆయనకు సర్టిఫికెట్‌ను అందజేశారు. సోషల్ వర్కర్‌గా పని చేస్తున్న రాజ్‌వీర్ మూఢ నమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వస్తున్నారు.



మద్యం మత్తులో కారు నడిపిన వ్యక్తి మృతి

మరో ముగ్గురి పరిస్థితి విషమం

దుండిగల్: శుభకార్యానికి హాజరైన వారందరూ మద్యంతో విందు చేసుకున్నారు.. అనంతరం మద్యం మత్తులోనే కారులో తిరుగు ప్రయాణ మయ్యారు. మద్యం మత్తులో మితిమీరిన వేగంతో కారును నడపారు. దీంతో మార్గమధ్యలో డివైడర్ గ్రీల్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో నలుగురికి తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

◆ ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన బాలపీరు(60), రాజు, రవీందర్, గోపాల్, వీరేష్‌లు క్యాబ్ డ్రైవర్లు. కాగా గురువారం బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్ ఓ శుభకార్యానికి కారు (ఏపీ 28 బీక్యూ 0124)లో వెళ్లిన వీరందరూ విందు అనంతరం మద్యం సేవించారు.

◆ ఫంక్షన్ పూర్తయిన తరువాత మధ్యాహ్నం 2గంటల సమయంలో బహదూర్‌పల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో కారు అదుపు తప్పడంతో భారత్ పెట్రోల్‌బంక్ ఎదురుగా ఉన్న డివైడర్ గ్రిల్‌ను ఢీకొట్టింది. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమయ్యింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను 108 వాహనంలో సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

◆ చికిత్స పొందుతూ కారు నడుపుతున్న బాలపీరు మృతి చెందాడు. కాగా రాజు, రవీందర్, గోపాల్, వీరేష్‌ల పరిస్థితి విషయంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పాత పైపులైన్ నుంచి తాత్కాలిక కనెక్షన్లు తీసుకుంటున్న ఇళ్ల యజమానులు

డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించారు.. తాగునీటి లైన్ మాత్రం ప్రారంభించలేదు



శివనగర్‌లో రోడ్డుపై నిర్మాణ సామగ్రిని డంప్ చేసిన దృశ్యం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని శివనగర్‌లో ఓ సంవత్సరం క్రితం వరకు ఆ రోడ్డు అద్దంలా ఉండేది. జనాభా పెరిగే కొద్ది వాటర్, డ్రైనేజీ వ్యవస్థల మరమ్మతుల కోసం రోడ్లను తవ్వారు. ఆ పనులు పూర్తి కావడానికి సుమారు 10 నెలలు పట్టింది. డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించారు. కాని తాగునీటి లైన్ మాత్రం ప్రారంభించలేదు. రోడ్డు పనులు కూడా ప్రారంభం కాకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

◆ దీనికి తోడు అదే గల్లీలో ఉండే ఓ భవన యజమాని నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు పైనే సామగ్రిని డంప్ చేయడంతో మరింత ఇబ్బందిగా మారింది. వాటర్ పైప్‌లైన్ విషయమై జలమండలి మేనేజర్ అంకిత్ భరద్వాజ్‌ను 'సాక్షి'వివరణ కోరగా కొత్త పైప్‌లైన్ పనులు పూర్తి చేశామన్నారు. ఇప్పటికైతే తాత్కాలికంగా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. పర్మినెంట్ కనెక్షన్ల విషయమై వినియోగదారులు సంప్రదిస్తే నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.